నీరు పల్లమెరుగు.....!

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

"భవాని ఉత్తరం వ్రాసింది." అంటూ ఇన్‌లాండ్ కవరు పట్టుకు వచ్చింది అనసూయ. అప్పుడే కోర్టునుంచి వచ్చిన (శివరామ)కృష్ణ కోటూ, టై విప్పుతూ, "ఏమని?" అన్నాడు. "చదవండి" అని ఉత్తరం టేబిలుమీద పెట్టి వెళ్ళబోతున్న భార్యను "ఉత్తరం నీకా నాకా?" అని ప్రశ్నించాడు. "ఇద్దరికీ అనుకోండి!...ఏమైతేనేం, అయినవాళ్లు కాకుండా పోతారా? మీరెన్నైనా చెప్పండి, భవాని నాకు నచ్చింది...ఉత్తరం చదవండి తెలుస్తుంది ఆ అమ్మాయి మంచితనం!...మీరనే చదువుకున్న గర్వం ఎక్కడా లేదు! ఊరికే ఏవేవో అంటారు!" అని లోనికి వెళ్ళింది అనసూయ.

ఆమె కాఫీ తెచ్చేలోగా ఉత్తరం సావధానంగా చదివాడు కృష్ణ. ఎం. ఎస్‌సి. చదువుకుని హైదరాబాదులో లెక్చరరు ఉద్యోగం చేస్తున్న భవాని తెలుగులో, ముద్దులొలికే ముత్యాల వ్రాతలో, అనసూయమీద ఆప్యాయతని ఒలకబోయటమూ!... పోతే, ఉత్తరంలో ఎక్కడా, చిట్టచివరకూడా తన మాటేలేదు! 'బావకు నమస్కారాలు...బావను అడిగినట్లు చెప్పగలరు' అలాంటి వాక్యం ఒకటి లాంఛనప్రాయంగాకూడా ఎక్కడా వ్రాయలేదు! ఈ ఉత్తరం యిద్దరికీ వ్రాసినదెలా అవుతుంది? భవాని తనకు మేనమామ కూతురు; అనసూయకు ఏమీకాదు! నాలుగేళ్ళనాడు తను భవానిని వివాహం చేసుకోకపోవటంతో రాకపోకలు, ఉత్తర ప్రత్యుత్తరాలు నిలిచిపోయాయి. ఇన్నాళ్ళకు, పదిహేను రోజుల క్రితం హైదరాబాదు వెళ్తూ భవానీ, అత్తయ్యా అనుకోకుండా తన యింటికి రావటం ఆశ్చర్యమే కలిగించింది ... 'నువ్వు చేసుకోకపోతేనేం? చదువుకుని హాయిగా ఉద్యోగం చేస్తున్న నాకేం లోటులేదని' తెలియబరచటానికే భవాని అలా వచ్చిందో, లేక చేసుకున్న అనసూయలో వంకలు వెదికి వెక్కిరించటానికే వచ్చిందో అనుకున్నాడు! ... తల్లీ కూతుళ్ళు చెప్పిన కారణంమాత్రం — హైదరాబాదుకు రాత్రిళ్లు ప్రయాణంచేసి రైళ్ళు వర్షాకాలం అని రద్దుచేశారట; ముందు రోజు సాయంత్రం కర్నూలు చేరుకుని, ప్రొద్దుట మొదటిబండికే హైదరాబాదువెళ్తే సౌకర్యంగా వుంటుందని వాళ్ళు వచ్చారట. ఆ విధంగా, కర్నూలులో ప్రాక్టీసు పెట్టిన కృష్ణను ఎన్నాళ్ళకో చూచి వెళ్ళటానికి సందర్భం కలిగిందట!...

బాగుంది! వాళ్ళకు లేకపోతే తనకేం అభ్యంతరం? అనుకున్నాడు కృష్ణ. ఏమైనా చిన్ననాటి భవాని, ఎమ్ ఎస్ సి. భవానిగా మారిన తర్వాత ఎలావుందో చూడాలన్న కుతూహలమూ తీరింది...చమత్కారం, చొరవ, కలుపుగోలుతనం పూర్వంలేని గుణాలు భవానిలో యిప్పుడు జిగేల్ మనిపించటమేకాదు, ఆమె మాటల్లో చూపుల్లో ధ్వని, ద్వ్యర్థికూడా వున్నాయని అనుమానమూ కలిగింది!...పూర్వం, అంటే భవాని హైస్కూల్లో, తను కాలేజీలో, చదివేరోజుల్లో ఒకసారి వాళ్ల ఊరువెళ్లాడు—అప్పుడు భవానికి అసలు మాటలు రావేమో అనిపించేటంత వల్లమాలిన సిగ్గు; తప్పించుకుని పారిపోయేది. ఉన్న వారం రోజులూ ఆ అమ్మాయితో చనవుగా మాట్లాడాలని ఎన్ని ప్రయత్నాలోచేసి చివరకు ఒక్కసారి కృతార్థుడయ్యాడు — "ఏమిటీ, మాట్లాడనే మాట్లాడవ్?... పారిపోతావ్!...పెళ్ళిచేసుకుంటావా?...వుండు, నిన్ను పెళ్ళి చేసుకుని అప్పుడు చెబుతాను నీపని!..." ఇవి కృష్ణమాటలు. "పో బావా!...సిగ్గులేకపోతేసరి!...ఊఁ...అప్పుడు చూద్దాంలే!" అని భవాని జవాబులు. "ఏమిటే మాసేది!...అలా అంటే యిప్పుడే పడుతుంది శిక్ష!" అంటూ తను చప్పున ముద్దుపెట్టుకోవటం, వెంటనే "అమ్మా" అని ఆ కొంటెపిల్ల కేకవేసి పారిపోవటం జరిగింది. నిజంగా అత్తయ్యతో చెబుతుందేమోనని గుండె దడదడలాడింది; కాని అలాంటిదేమీ జరగలేదు...ఆ భవాని అవన్నీ, ఎమ్ ఎస్‌సి., చదువుకోవాలని పట్టుపట్టడం, మేనమామ కట్నం ఇవ్వననటం కారణాలుగా ఆ వివాహం జరగలేదు..."నేను చదివింది బి. ఏ; భవాని అదన్నా పూర్తిచెయ్యాలనీ ఎమ్. ఎస్‌సి. కి వెళ్ళాలని పట్టుపట్టుతూంటే, నాకు భార్య కావాలనుకోవటం లేదన్నమాట!" అని భవాన్ని తన కక్కరలేదన్నాడు. అదీగాక కృష్ణ తండ్రి అప్పటికే కట్నం కావాలని, అయినవాళ్ళూ కానివాళ్ళూ, అన్న భేదం లేకుండా సంబంధాలన్నింటినీ 'సమదృష్టి'తో పరిశీలిస్తున్నాడు. పర్యవసానం అనసూయ పదిహేను వేలతో ఆ యింటికి కోడలైంది.

అందువల్ల చదువుకున్న భవాని మారిపోయి వుంటుందనే అనుకున్నాడు కృష్ణ. కాని భవాని స్వయంగా తన యింటికి రావటమేమిటి, వచ్చిన తర్వాత వుండమంటే తీరిగ్గా రెండురోజులు వుండి వెళ్ళటమేమిటి, అనసూయను 'అక్కా' అని పిలవటమేమిటి, అన్నీ ఆశ్చర్యం కలిగించాయి. భవాని సంభాషణలో కొన్ని ధ్వనులు ఒకరకం అనుమానానికి కారణాలయ్యాయి...భవాని చిన్ననాటి సంఘటనను మరచిపోయినట్లు లేదు. బహుశా ఆమెలో కొంత విచారం వుందేమో పెళ్ళి తప్పిపోయినందుకు, అనిపించింది...ఆ ఊహ రావటమే తడవు అదిక్రమంగా బలపడిపోయింది కూడా. దానికి ఆధారాలు—భవాని, పిలవకుండానే యిన్నాళ్ళకు తనయింటికి రావటం, వచ్చిన తర్వాత చూపిన కలుపుగోలుతనం...భవానికి ఎంత అభిమానం, ప్రేమలేకపోతే, స్త్రీ సహజమైన స్వాభిమానం అహంకారం అన్న అవధుల్ని దాటి అలా రాగలుగుతుంది! అహంకారం, అందులో చదువుకున్న యువతికి, ఎంతమేర వుంటుందో సులభంగానే ఊహించుకోవచ్చు. దాన్ని జయించి భవాని బావకోసం వచ్చిందంటే, ఆమె జరిగినదానికి ఎంతో పశ్చాత్తాప

పడుతూ వుండాలి!...ఈ కాలేజి ఆడపిల్లలందరూ యింతే. డిగ్రి వస్తే ఏదో అంబరమెక్కి, ఆదర్శపురుషుణ్ణి అందుకుంటామనుకుంటారు. తీరా అది వచ్చిన తర్వాత తెలుస్తుంది. ఎలా అవకాశాలు ఆచేతికే తమ మూర్ఖత్వంవల్ల చేజారిపోయాయో!...అప్పుడు కాని గ్రహించరు చదువూ, ఉద్యోగమే పరమావధులు కావని!.. భవానిలో యిటువంటి పరివర్తనే వచ్చివుండకపోతే, మళ్ళీ తనని జ్ఞాపకం తెచ్చుకుంటుందా? తన యింటికి వస్తుందా? పెదగా చదువుకోని అనసూయను రెండుపట్లుకొని 'అక్కా' అంటూ తిరుగుతుందా?...మళ్ళీ ఇద్దరూ ఇంచుమించు సమవయస్కులే!...

అయితే భవాని అనసూయపట్ల ఈర్ష్య, అసూయ కొంచమైనా వ్యక్తం చేయటం లేదేమిటి? పైగా పూసుకు తిరగటం వల్ల లాభమేమిటి? అన్న సందేహం కలిగింది. కృష్ణకు దానికి సమాధానం- పరిస్థితులు అలావున్నాయి బావ పరాయివాడైపోయాడు; యిప్పుడు బావతో సరాగాలాడటం ప్రారంభిస్తే ఏమనుకుంటాడో? ఆ అనుమానం వస్తే అనసూయ మళ్ళీ గుమ్మం తొక్కనిస్తుందా? అందువల్ల, తన ప్రేమ నిర్భయంగా ఏదో సూక్ష్మమార్గంలో ధ్వనిపూర్వకంగా చమత్కారంగా వ్యక్తం చెయ్యగలిగింది భవాని! అందుకే ఘటికులు! ఆడవాళ్ళు యిటువంటి విషయాల్లో చతురలు ఇక చదువుకున్న భవానిలో ప్రజ్ఞకు లోటులేదు! తనకు భవాని యిప్పుడు పూర్తిగా అర్థమౌతోంది అనుకున్నాడు కృష్ణ.

కుర్చీలో నిటారుగా కూర్చొని, టేబిలుమీదవున్న ఉత్తరం మళ్ళీ తీసి పరీక్షించాడు.

ఉత్తరాన్ని జాగ్రత్తగా అనసూయ పేర వ్రాస్తూ, అనసూయకు ఆసక్తివుండే విషయాలతో నింపింది భవాని! అందులో ఎక్కడా బావనుద్దేశించిన వాక్యంలేదు కాని చివర చిట్టిబాబును గూర్చి వ్రాసిన వాక్యాల్లో ఒక విశేషం వుంది.

"...బాబు మాటలు ఎప్పుడూ జ్ఞాపకం తెచ్చుకుంటూ వుంటాను....నీతో బాగా ఆడుకుంటున్నాడా? నిన్ను అల్లరి పెడుతున్నాడా? బాబకు నా ముద్దులు..."

చివరి వాక్యంలో 'బాబు'కు బదులు 'బాబ' అని వ్రాయటం అబుద్ధిపూర్వకమైన పొరపాటా? లేక మనసులోనుంచి తెలీకుండానే ఊడిపడిందా? 'బాబ' అంటే 'బావ' అనేగా ఉద్దేశ్యం? లేకపోతే యీ 'పొరపాటు' జాగ్రత్తగా వ్రాసిన ఉత్తరంలో ఎందుకు వస్తుంది? ఈ ఉత్తరం ఎలాగూ అనసూయ తనకు చూపిస్తుందని భవానికి తెలుసు; అందులో వ్రాసిన ఉలెన్‌వాక్కో కోమైనా చూపించి తీరుతుంది! అంతమాత్రం 'గ్యారంటీ' కూడానే వుంది ఆ ఉత్తరంలో!.

కృష్ణ ఉత్తరం చూస్తూవుండగానే అనసూయ టిఫిన్ కాఫీ తెచ్చి "అదేమిటి యింతసేపూ చదువుతూనే వున్నారా ఉత్తరం! ఏమిటో అంత ఆశ్చర్యం అందులో?" అన్నది.

"ఆశ్చర్యం ఏమీలేదు!" అంటూ ఉత్తరం మడిచి, టేబిలు మీదకి గిరవాటువేసి లేచాడు కృష్ణ.

"ఆశ్చర్యం కాకపోతే, కాళ్ళూ ముఖం కడుక్కోకుండా అలానే కూర్చుండిపోయారేమిటి యింతసేపు?" అన్నదామె.

కృష్ణ బాత్‌రూమువైపు వెళ్ళిపోయాడు.

భర్త టిఫిన్ తీసుకుంటూ వుండగా అనసూయ అన్నది.

"ఉత్తరం చదివారు కదా, మరి శాలు ఎప్పుడు తెచ్చి పెడతారు?"

"ఎందుకూ దండగ? ఎంతసేపూ బాబును చూచుకోవటంతో నావైపు చూట్టానికే తీరటంలేదు నీకు! మళ్ళీ యిదొకటి!"

"నమూనాలు పంపిస్తుందిట; బాబుకు ఒక స్వెటర్, మఫ్లర్ అల్లుకోవాలి."

"ఏం చేసుకోను? మనమేం ఇంగ్లండులోగాని, ఊటీలోగాని లేముగా! ఇదొక పెద్ద క్రేజ్ గా తయారైంది...ఇంగ్లీషు, అమెరికన్ ఆడవాళ్ళు చేస్తారంటే అది ఆ దేశాల్లో అవసరం; వాళ్ళకు పొద్దుపూ జరుగుతుంది మనకు అనవసరం. అలవాటు లేనివి తయారుచేస్తూ కూచోవటం డబ్బుదండగ! ఎప్పుడైనా కావలిస్తే శుభ్రంగా కొనుక్కోవచ్చు! ఈ కర్నూలులో స్వెటర్ వాడుకునే దెప్పుడు?"

"మీ ఉలెన్‌సూట్ల మాటేమిటి?"

"అవి దర్జాకోసం! నీ దానికంతా అర్థంలేని క్రేజ్."

"పోనీలెండి; యింతలో నూరూ వేలూ ఖర్చైపోవటంలేదు గాని, ఆ శాలుమాత్రం తెచ్చి పెట్టండి."

"చుట్టపుచూపుగా వచ్చి మంచిగొడవే తెచ్చిపెట్టిందే యీ భవాని!"

"భవానిమీద మీకంత కోపం దేనికండీ?...మిమ్మల్ని చేసుకోలేదనేనా?" అన్నది నవ్వుతూ అనసూయ.

"పాపం, చాల పొరపాటు పడుతున్నావ్! ఎం. ఎస్‌సి. చదవగానే ఏదో పెద్ద దేవతలా కనిపిస్తోంది నీకంటికి. మేమంతా కేవలం మానవమాత్రులం అందుకే ఆ దేవతకు యింకా సరియైన దేవుడు దొరక్క దేవుళ్ళాడుతూ వుంది."

"అవును, తొందరేం? వచ్చినవాణ్ణే చేసుకుంటుంది!"

"తొందరేం! ఒక జీవితకాలం అంతా నిరీక్షిస్తూ వుండవచ్చు"

"పోనీ మీ కెక్కడైనా చూడండి సంబంధం."

"అది మరి బావుంది! నువ్విప్పుడు కోరుకున్నదానికంటే యిందాకటి కోరికే నయంగావుంది. ఆ శాలు ఏదో తెచ్చిపెట్టేను తిప్పలంటా; తర్వాత నువ్వూ భవానీ ఏమైనా అవండి నాకెందుకు?"

బజారువైపు బయలుదేరి వెళ్ళాడు కృష్ణ.

వెళ్ళాడే గాని శాలు కొనాలనిపించలేదు. ఒంటరిగా షికారు వెళ్ళాడు

బావకు ముద్దులు—అన్న మాట మనస్సులో మెదుల్తూ తియ్యని ఉత్సాహానికి కారణమౌతోంది...నిజమే, ఆరోజుల్లో భవాన్ని తను ప్రేమించాడు, భవాని కూడా తన్ను ప్రేమించింది. ఇష్టమే లేకపోతే "అమ్మా" అంటూ పారిపోయి తల్లితో చెప్పకుండా ఎందుకు వూరుకుంటుంది? ఇద్దరికీ అది అనుభవం చాలిని రోజులు; భవాని చదువు ముఖ్యమని, లేక తనమీద పంతం నెగ్గాలనీ అప్పుడా ధోరణి అవలంబించింది, భవాని పట్టుపట్టివుంటే మామయ్య కట్నం యిచ్చి

వుంటేవాడు; ఆయనకు వసలోపం ఏమీ లేదు! అవకాశం దాటి పోయినతర్వాతగాని అనుబంధమెటువంటిదో తెలిసిరాలేదు. ఇప్పుడు తెలిసినమాత్రం భవాని ఏం చేస్తుంది? భవాని దురదృష్టవంతురాలు, తనూ దురదృష్టవంతుడే! తన మనస్సేమిటో తనూ తెలుసుకోలేదు! అంత పట్టుదలమీద వివాహం చేసిన తండ్రీ బావుకున్నదేమీ లేదు; ఏడాదైనా పూర్తిగా గడవకముందే యీ లోకంనుంచి దాటుకున్నాడు...

అసలు వివాహానుబంధం మనస్సుల్నీ, వ్యక్తుల్నీ ముడివేసే బంధం; దానికి భౌతికమైన, శారీరకమైన ఆకర్షణలు, ప్రేరేపణలు కేవలం దోహదాలుమాత్రమే అనసూయమీద పెళ్ళయిన క్రొత్తలో తనకెంత మమకారం! అదంతా ఇప్పుడేమైపోయినట్లు? ఇద్దరు పిల్లలు కలగటంతో కల కరిగిపోయింది! పెద్దపిల్ల అమ్మమ్మదగ్గర ఉంచబట్టికాని లేకపోతే ఇల్లు సాక్షాత్తు నరకమే!...

"ఎప్పుడైనా హైదరాబాదు వస్తే రా నాయనా!' అన్నది అత్తయ్య బండెక్కుతూ. భవాని తననోటితో అనవలసినమాటనే తల్లి ద్వారా అనిపించింది! అవును ఎలా అంటుంది?

తనొకసారి హైదరాబాదు వెళ్ళివస్తే! వెళ్ళితే భవానితో తీరిగ్గా మాట్లాడటానికి, భవాని మనస్సు తెలుసుకోవటానికి అవకాశం వుంటుంది...

తెలుసుకొని ఏం చెయ్యాలి?...ఏం చెయ్యాలి? తెలుసుకోవటం దానికదే సార్థకం...సౌందర్యాన్ని ఆరాధించటం, ప్రేమ అన్న అనుభూతి—ఇవి ఎరుగని జీవితం ఒక ఎడారి; కేవలం శూన్యం! ఏమైనాసరే ఈ సందిగ్ధం తీర్చుకోవాలి; యదార్థమేమిటో తెలుసుకోవాలి! వీలైతే భవానితో హృదయం విప్పి నిష్కల్మషంగా చెబుతాడు—తన ప్రేమ ఎంత ఉదాత్తమైనదో! ప్రేమించుకున్నవాళ్ళందరూ పెళ్లి చేసుకోలేరు; మానవలోక చరిత్రలో ఎక్కడా కనిపించే విషయమే అది; క్రొత్తేమీ కాదు! దాని కెవరేం చెయ్యగలరు? కాని సందిగ్ధావస్థలో సతమతమవటం కన్న ప్రేమికులు ఒకరిహృదయాన్నొకరు తెలుసుకోవటంమంచిది అందులో తప్పులేదు; ఒక సంతృప్తివుంది!...తీరని కోరికల బరువుమోసే భవాని హృదయానికి కొంత తేలిక చేకూర్చినట్లవుతుంది. అంతమాత్రం చేయటం తనవశ్యం! భవాని స్వాభిమానమున్నది దిగమ్రింగి తనకోసం ప్రయాణమై వచ్చినపుడు తను వాళ్ళయింటికి వెళ్ళటం, అది తనకు విధాయకమే!...

కృష్ణ ఇల్లుచేరుకోగానే అనసూయ "ఊలు తెచ్చారా?" అని ప్రశ్నించింది.

'లేదు, మంచిది దొరకలేదు...అయినా తలుచుకోగానే తెప్పై? నాలుగురోజులు ఆలస్యం అయితే ఏం పోతుంది? నేను ఎల్లుండి కోర్టుపనిమీద హైదరాబాదు వెళ్ళవలసి ఉంటుందని వెంకట్రామయ్యగారు క్లబ్బులో కనిపించి అన్నారు అలా వెళ్లేటట్లయితే అక్కడినుంచే తెచ్చుకోవచ్చు."

"అయితే భవానికూడా నమూనాలు ఇస్తుంది లెండి; భలే కుదిరిందె మీ ప్రయాణం!"

ఏం! చాలా సంతోషిస్తున్నావే? హైదరాబాదుకు వెళ్తున్నాను గాని, భవానిని చూడటానికి కాదు గా!"

"ఇహ చాల్లెండి!...సరాసరి వాళ్ళింటికే వెళ్ళండి!...ఒక వేళ మీ పనులవల్ల అలా వీలుపడకపోతే తప్పకుండా తీరిక చేసుకొని వాళ్ళనొకసారి మాట్లాడించి రారండి! వాళ్లు మనింటికి వచ్చినప్పుడు మనమూ వెళ్ళటం బావుంటుంది...మీ రిలా హెచ్చులుపోవటమేం బాగులేదు!" అన్నది మందలింపుగా అనసూయ.

"అబ్బ! అన్నీ బాగోగులూ నీకే తెలిసినట్టు మాట్లాడుతావే!" అన్నాడు కృష్ణ.

* * *

కృష్ణ మనస్సు ఉయ్యాలలూగుతోంది. ఎన్నోరకాలైన సంభాషణలు—తనకూ భవానికీ—హృదయాలు విప్పి చెప్పుకునే మాటలు...అందులో విషాదం లిప్తమై, గంభీరమూ ఉదాత్తమూ అయిన పరస్పర సాన్నిహిత్యభావం...సంఘం యిద్దరిమధ్యా తెచ్చిపెట్టిన కృత్రిమమైన ఎడబాటు.....ఆ అనుభూతిని ఎన్నో విధాల ఊహించుకొని హృదయంలో యిముడ్చుకోలేక, పిచ్చిగా యిటు అటూ తిరుగుతున్నాడు, ఆలస్యంచేస్తున్న రైలుకోసం ఎదురు చూస్తూ కృష్ణ.. ఆ గంట ఆలస్యం అనేకయుగాలుగా వుంది...

"బావా!" అంటుంది భవాని దీనంగా, ఆర్ద్రంగా, తనకుండె చీలుస్తున్నట్టు...'ఏంచెయ్యను, భవానీ! ఇది విధి'"...బహుశా తను ఆమె హస్తాన్ని ప్రేమతో స్పృశిస్తాడు; గాజుల్ని కదిలిస్తాడు; అందులో కల్మషమైన ఉద్దేశ్యం ఏమీ లేదు! . అలా కాదు—భవాని కన్నీళ్ళు చూడలేక ఆమె చెంపల్ని మృదువుగా తాకుతాడు; ముత్యాలవంటి అశ్రువుల్ని కొనగోటితో సంగ్రహిస్తాడు!...

"ఈ సంఘాన్ని, యీ లోకాన్ని వదిలి దూరంగా ఎక్కడికైనా వెళ్ళిపోదాం బావా!.." అంటుంది భవాని. "పిచ్చి భవానీ! ఎక్కడికి వెళ్తాం చెప్పు? లోకం మనల్ని అంత సులభంగా వదిలిపెడుతుందా? భ్రమ! గుమ్మెత్తిపోస్తుంది...వెంటాడుతుంది..."—సెంట్రలు గవర్నమెంటు నేసిన చట్టం వుండనే వుంది; ఎక్కడికి తప్పించుకొనిపోతాం?...

"ఆంధ్ర వారపత్రిక, సార్" అన్నాడు పత్రికలమ్మే కుర్రవాడు. కృష్ణ వాడివైపు కోపంగా చూసి "వద్దు" అన్నాడు. . వాడు వెళ్ళగానే పశ్చాత్తాపంతో 'నిజమే. ఏదైనా పుస్తకం వుంటే బావుండేది!' అనిపించి బుక్ స్టాలువైపు వెళ్ళాడు. కాని నచ్చిన పుస్తకమేదీ దొరకలేదు ..

"ప్రయాణంమీదే వచ్చినట్లున్నారు? ఎందాక? హైదరాబాదేనా?" అప్పుడే ప్లాట్ ఫారంమీద ప్రవేశించిన—సుబ్బారావు పలకరించాడు

"అవును."

"ఏమిటి విశేషం? కోర్టుపనిమీదేనా?"

"కాదు! పర్సనల్ ...అంటే ఏమీ లేదు, మా అత్తయ్యకు జబ్బుచేసిందట; వెళ్ళొకసారి చూసి వద్దామని..."

"అంటే మేనత్తేనా?"

ఓ అరక్షణం సందేహించి "అవును" అన్నాడు కృష్ణ. మరి మేనమామ భార్య మేనత్త కాకేమౌతుంది?

సుబ్బారావు ప్రారంభించిన బాతాఖానీ, రాత్రి ఎనిమిదింటికి కాఫీకూడా సిపక్ వచ్చేదాకా ఎక్కడా ఆగలేదు.

"ఇంకా నయం, కోర్టుపని అని అడగ్గానే చెప్పలేదు; తన వెంట రమ్మని పీడించేవాడు" అనుకుంటూ స్నానంచేసుకుని బయలు దేరాడు కృష్ణ, భవాని అడ్రెసు వెతుక్కుంటూ...

భోజనంచేసి గదిలో కూర్చున్నతర్వాత భవాని అడిగింది: "ఏం బావా! ఒక్కడివే వచ్చావు; అనసూయను కూడా తీసుకు రాలేకపోయావా?" ...అక్కయ్య అనకుండా, అనసూయ అంటోంది భవాని!

"రెండు రోజుల పనిమీద వచ్చాను, ఎలా వీలౌతుంది చెప్పు?...నువ్వు వ్రాసిన ఉత్తరం మొన్నటి రోజు చేరింది, చూశాను..." అర్ధంతంగా అందించాడు.

"బాబు ఏంచేస్తున్నాడు? బాగా అల్లరిచేస్తున్నాడా?" అన్నది సుముఖంగా చిరునవ్వుతో భవాని

"మొత్తానికి నీకు చాలా ఫేవరిట్ అయినట్టున్నాడు...అదృష్టవంతుడే!"

"అవును ఫేవరిట్టే మరి!...ఏంకాకూడదా?.. పోనీ వాణ్ణైనా వెంట తీసుకురాకూడదూ! ఎంతో ముద్దుగా వుంటాడు నాదగ్గర...మళ్ళీ నువ్వెళ్ళేటప్పుడు అప్పజెప్పేదాన్ని."

"వాడు అలా వస్తాడా? మళ్ళీ నువ్వే ఎప్పుడో ఒకసారి వాణ్ణి చూడటానికి రావాల్సిందే!"

"అంటే వాళ్ళ నాన్నబుద్ధే వచ్చిందేమిటి వాడికి?...ఇంకా తల్లిపోలిక కాబోలు అనుకుంటున్నా!'

"బహుశా అందులో కొన్ని నీ పోలికలూ.."

"ఏం? నా మంచితనం ఎవరికైనా రావలసిన గుణమే! నేను మంచిదాన్ని కాబట్టే మళ్ళీ మీ యింటికి రావటం జరిగింది..."

"నేను కాదనటంలేదు భవానీ!...అందుకనే నేనూ యిలా రావటం..."

'పోనీ బావా! గతాన్ని మరచిపోదాం...All's well that ends well అంటారు."

* * *

ప్రొద్దున తొమ్మిదిన్నరకు భవాని కాలేజికి వెళ్ళిపోయింది సాయంత్రం అయిదింటికిగాని తిరిగిరాదు. అత్తయ్యతో కాస్సేపు మాట్లాడి, పన్నెండుకు భోజనంచేసి బయలుదేరాడు కృష్ణ. 'కోర్టుపనిమీద వచ్చాను" అని పగలంతా ఇంట్లోనే కూర్చుంటే ఏం బావుంటుంది?

బుక్ షాపుకువెళ్ళి ఒక ఇంగ్లీషు నవలకొని, పబ్లిక్ గార్డెన్సులో ఒకమూల చెట్ల నడుమ చల్లగావున్న ఏకాంతప్రదేశాన్ని చేరుకొన్నాడు.

పుస్తకం చదివే నిలకడ మనస్సుకు లేకపోవటంతో, వెల్లకిలా పడుకుని ఊహల్లో తేలిపోయాడు...రాత్రి భవాని అన్నట్లు భవానిలో మంచితనం వుంది. ఆ మంచితనం భవాని చదువుకూ, అందానికీ పదహారువన్నె. భవానినే వివాహమాడివుంటే జీవితం ఎంత స్వర్గధామంగా వుండేది!...తను హైకోర్టులో ప్రాక్టీసు, భవాని కాలేజిలో ఉద్యోగంచేస్తూ, దర్జాగా కారు, బంగళా, స్నేహితులు అంతా హైదరాబాదు వాతావరణానికి తగినట్లు అమరివుండేది!... సెలవురోజుల్లో, తీరిక సమయాల్లో ఇలా ఉద్యానవనాల్లో, ఉస్మాన్‌సాగర తోటలలో, పచ్చికమీద, చెట్లనీడ, భవానితో ...చీకూచింతా లేకుండా.. జీవితం సౌందర్యారాధనకు, సౌఖ్యసాధనకు అంకితమై మధుర మంజుల కావ్యంలా సాగిపోయేది!.. ఒక్క పొరపాటు... తనలోని మూర్ఖత్వానికి, తండ్రి సంకుచితత్వానికి తను అప్పట్లో లొంగిపోవటం...అంతటితో దగ్గరగావచ్చి పెదవుల్ని స్పృశించబోతున్న అమృతపాత్ర దూరంగా ఎక్కడికో గిరవాటు! ఇప్పుడిక తను చెయ్యగలిగిందేమిటి?

భవానితో సంబంధం, అది శాశ్వతమైనది ఎన్ని పొరపాటు జరిగినా! అది ధర్మవిరుద్ధం కాని పవిత్ర ప్రణయబంధం; అలా వుండిపోతుంది. అది అంతరలోకంలో వికసించిన ఒక పువ్వు; దానికి వాడిపోవటమంటూ వుండదు; ఫలించటమూ వుండదు! భవానికి తన కొడుకుమీద మమకారం...కాస్త పెద్దవాడైన తర్వాత వాణ్ణి భవానికే అప్పజెప్పటానికి తనకేం అభ్యంతరంలేదు! ఇన్నాళ్ళూ ప్రేమ అనేది ఊహామాత్రమే; కథల్లో కావ్యాల్లో; ఇవాళ జీవితంలో ప్రవేశించి ప్రేమ తన యథార్థతని రుజువు చేసుకుంటున్నది!

సాయంత్రం నాలుగ్గంటలకే ఇంటివైపు బయలుదేరాడు కృష్ణ. వచ్చేటప్పటికి తనుసిద్ధంగా వుండాలి. తర్వాత బజారుకు వెళ్దామంటూ చెప్పి భవానిని ఏదైనా సినిమాకు తీసుకొనిపోయి, నెమ్మదిగా ఆమె హృదయంలో దాచుకున్న రహస్యాన్ని చెప్పించాలి...

వెళ్ళగానే అత్తయ్య టిఫిన్ కాఫీ యిచ్చింది..."భవాని ఏ వేళకు వస్తుందో, కాలేజిలో మీటింగో ఏదో వుంటే ఆలస్యం అవుతుంది, నువ్వు తీసుకో నాయనా" అన్నదామె...అయిదు దాటినా భవాని జాడలేదు...'బజారుకు వెళ్ళి రావాలన్నావు, వెళ్ళలేదా?" అంటోంది అత్తయ్య లోగు గదిలోకివచ్చి...ఏమీ తోచనటు, భవానికోసమేనంటూ అలా కూర్చోవటం బాగులేదని కృష్ణ యింటినుంచి బయలుదేరి, సుల్తాన్‌బజారువైపు నడిచాడు...

కొన్ని షాపులు తిరిగి, చౌరస్తాలో మనుష్యుల్ని చూస్తూ కొంతసేపు నిలబడి, మళ్ళీ ఎనిమిది గంటలకు యిల్లు చేరుకున్నాడు. ఇంటిముందు ఫియట్ కారొకటి నిలబడివుంది క్రింది భాగంలో వున్నవాళ్ళకోసం ఎవరో వచ్చారు కాబోలు ననుకుంటూ మెట్ల గదిని సమీపించేటప్పటికి ఒక యువకుడూ అతనివెనుక భవానీ, ఏదో మాట్లాడుకుంటూ నవ్వుతూ మెట్లుదిగి వస్తున్నారు. కృష్ణ అప్రయత్నంగా తలుపులున్న ఒక ప్రక్కకు తప్పుకున్నాడు వాళ్ళకు కనిపించకుండా.

భవాని చక్కగా అలంకరించుకొని రతీదేవిలా వుంది. కృష్ణ ఆశ్చర్యంగా ఆమెను చూస్తూ వుండగానే, ఆమె కారులో ముందు సీటులో కూర్చోవటం, యువకుడు ఆమె ప్రక్కన కూర్చుని డ్రైవ్ చేసుకుని వెళ్ళిపోవటమూ జరిగింది.

కృష్ణకు పాదాలక్రింద భూమి జారిపోయినట్లయింది. కోపం వచ్చింది; అవమానం కలిగింది...'ఏమిటి ప్రవర్తన? ఈ ఆటలు?'

అనుకుంటూ మెట్లెక్కి పైకి వెళ్ళాడు. వెళ్ళి వరండాలో కుర్చీలో కూలబడ్డాడు.

తర్వాత పావుగంటకు కాని అత్తయ్య, కృష్ణ వచ్చి వరండాలో కూర్చున్నాడని గమనించలేదు.

"ఎప్పుడొచ్చావ్ రామం? లే నాయనా, వడ్డిస్తాను!" అన్నదామె. కృష్ణను చిన్నతనంనుంచీ వాళ్ళు 'రామం' అని పిలిచేవాళ్ళు!

"భవాని రానేలేదా?" అన్నాడు తనకేమీ తెలియనట్లు; ఆమె కెంత తెలుసో పరీక్షించాలన్న కుతూహలంతో.

"నువ్వటువెళ్ళిన కాస్సేపటికి వచ్చింది...ఇవ్వాళ వాళ్ళ కాలేజి లెక్చరరుగారి యింట్లో వాళ్ళ అబ్బాయి పుట్టినరోజు పండుగ, విందుకురమ్మని యిందాక కారు పంపితే వెళ్ళింది...చాల మంచి కుటుంబం, మనవాళ్ళే..."

"అలాగా! వాళ్ళ ఆడవాళ్ళువచ్చి తీసుకువెళ్ళారు కాబోలు."

"బావుంది, ఆడవాళ్ళవనే అక్కడ ఏర్పాట్లెవరు చూస్తారు? వాళ్ళు నిన్న వచ్చి పిలిచిపోయారు. నేనూ వెళ్దామనే అనుకున్నాను. నువ్వు ఊరినుంచి వచ్చావుగా, అందుకని అమ్మాయిని వెళ్ళి రమ్మన్నాను. లెక్చరరుగారి తమ్ముడు వచ్చి తీసుకువెళ్ళాడు. నువ్వు లేచి భోంచెయ్యి."

కృష్ణ ఎంగిలిపడి చెయ్యి కడుక్కునివచ్చి మళ్ళీ వరండాలో కూర్చున్నాడు...

ఆ యువకుడి నవ్వులో కలిసిపోయిన భవాని నవ్వు అతని చెవుల్లో ప్రతిధ్వనిస్తూనేవుంది! తను ఊహించిన పరిస్థితి వేరు, ఇక్కడ యధార్థ స్థితి వేరు! ఎంత తెలివిమాలినతనంతో బయలుదేరి వచ్చాడు!...కాని త ఊహలో అసంబద్ధం ఏమీ లేదు. తనకు తెలిసినమేర ఊహ సరిగానే వుంది; పోతే తనకు తెలీని విషయంకూడా ఇందులో వుంది. అంటే విషయం సంపూర్ణంగా తెలీలేదు, అంతే!

కాలేజీలో ఆరేళ్ళు చదువుకుని, లోకంలో ఒరపిడి కలిగాక కూడా భవాని భవానిగానే ఎక్కడైనా వుంటుందా...తనకోసం తపస్సు చేస్తున్న ముగ్ధ, చదువువల్ల బుద్ధి తెలివి వికసించినా హృదయ సౌరభ్యం కోల్పోకుండా తనకోసమే దాన్ని రహస్యంగా దాచి వుంచుకొన్న మనోజ్ఞ పుష్పం, భవాని తన ప్రణయ దేవత అనుకున్నాడు కాని అదెలా సాధ్యం?...పరిసరాలు, సంఘం, బలీయమైనశక్తులు...భవానిలోని నిస్పృహ, నిర్వేదం, బావ భగ్నం చేసిన కోరికలూ, అవన్నీ యీ విధంగా పరిణామం చెందాయి అనుకోవాలి గాని!

అంతేకాదు! హేతువాదం ఒకటి వుందిగా! 'బావ యింకొకర్తెను పెళ్ళి చేసుకొని సుఖపడటం లేదూ? నేనుమాత్రం మరొక వ్యక్తితో స్నేహం చేస్తే తప్పేమిటి?'—స్నేహం!...అది మొదట్లో స్నేహమే; తర్వాత చనువు; ఆ చనువు తీరా పతనానికి సర్వనాశానికి దారితీస్తే కాని తెలీదు...యీ వితండవాదం వల్లే కలిగే దుష్ఫలితం! లేకపోతే నవ్వుతూ, కారులో వాడి ప్రక్కనకూర్చుని వెళ్ళటమేమిటి? వెనుకసీటులో కూర్చోవచ్చుంగా, ముగ్ధంగాని! ఇంతకూ ఉద్యోగరీత్యా పరిచయమైనవ్యక్తి ఆ లెక్చరరు; అతనితమ్ముడితో యింత చనువు దేనికి?

కృష్ణ వెళ్ళి పడుకున్నాడు. నిద్రరాలేదు...భవాని రాలేదు, యింకా ఏం చేస్తూవుందో! పెద్దావిడ యింట్లోవుండి లాభం ఏమిటి?...బావ వచ్చాడే, ఏమనుకుంటాడో అన్న జంకు లేకుండా భవాని యిలా ప్రవర్తిస్తోందే, యిక మామూలుగా భవానికి యీ ఊళ్ళో హద్దులేమిటి? తనవెంట చూడటం లేదన్న ధీమా, తల్లికేవో కారణాలు కల్పించి చెప్పి సులువుగా మోసం చెయ్యగలిగిన ప్రజ్ఞా వున్న భవానికి అడ్డేమిటి?

తొమ్మిదిన్నరకు భవాని తిరిగివచ్చింది కారులో...

"బావ భోంచేశాడా అమ్మా?" అని అడుగుతోంది...ఒకవైపు తను ఏమనుకుంటాడో అన్న సందేహం వుండనేవుంది, నయమే!

"ఆఁ."

"అప్పుడే పడుకున్నాడేమిటి?"

"పగలు తిరిగి తిరిగి వచ్చాడేమో, నిద్ర వచ్చినట్లుంది!"

కృష్ణ యీ సంభాషణ వింటూ వున్నా మాట్లాడదలచుకోలేదు.

* * *

తెల్లవారింది. శనివారం. 'వెంటనే కర్నూలు వెళ్ళిపోదామా' అనిపించింది కృష్ణకు. కాని యింతదూరం వచ్చినతర్వాత యీ సంగతేమిటో పూర్తిగా తెల్సుకుని వెళ్ళటమే మంచిదనుకున్నాడు. రాత్రిసంఘటన జ్ఞాపకంరావటంతో భవానిని తను పెళ్ళిచేసుకోకపోవటం మంచిదే అయిందని తోచింది. చదువుకున్న యువతి తప్పకుండా ఉద్యోగం చేస్తానంటుంది; ఉద్యోగంచేసే యువతి ధోరణి యిలాగే తయారవుతుంది. 'ఫలానావాడిభార్య' అని అందరూ వేలెత్తి చూపుతూవుంటే భర్త తలదించుకోవలసి వస్తుంది...అందులో భవాన్ని శాసించే నేర్పు తనకెక్కడిది?... అసలు భవాని మనస్తత్వంలోనే చపలత్వం వుంది! లేకపోతే తనను ప్రేమించి, తీరా పెళ్ళిప్రసక్తి వచ్చేసరికి చదువుకుంటానని మొండిపట్టు పట్టటమేమిటి? అలా అని వదిలిపెట్టుకున్న తర్వాత మళ్ళీ తనమీద ఆసక్తి, అర్థాలు వచ్చేటట్టు మాటలూ, ఉత్తరాలూ!...ఏమిటిదంతా, కేవలం చపలత్వం కాకపోతే! భవాని అంటే ఒక తేలిక అభిప్రాయం ఏర్పరచుకున్నాడు కృష్ణ.

"ఏం భవానీ! నిన్నటిరోజు దర్శనమే లేదే!" అన్నాడు కాఫీ తీసుకుంటూ.

"కాలేజినుంచి వచ్చేప్పటికే ఆలస్యమైంది. తర్వాత మా కెమిస్ట్రీ ప్రొఫెసరుగారింట్లో అబ్బాయి పుట్టినరోజు విందుకు వెళ్ళాను..."

"అనసూయ ఏదో ఊలూ అదీ కావాలన్నది; నువ్వొస్తే సాయంత్రం బజారు వెళ్దామనుకున్నాను."

"అలాగే, సాయంత్రం నేను కాలేజినుంచి రాగానే వెళ్దాం. ఇవ్వాళ తొందరగానే వచ్చేస్తాను" అన్నది భవాని.

సాయంత్రం ప్రోగ్రాం ఏమిటో తీరికగా ఆలోచించుకున్నాడు కృష్ణ. ఆ రోజు మ్యూజియంలో మధ్యాహ్నమంతా గడిపి ఎలాగైనా భవాన్ని సినిమాకు తీసుకువెళ్ళాలి...ఆ మాట ముందుగా

చెబితే అత్తయ్యకూడా ప్రయాణమౌతుంది; అదో చిక్కు! అందువల్ల బజారుకు వెళ్ళినతర్వాతనే ఆ విషయం కదపాలి......

అంతా కృష్ణ అనుకున్న శైలిజరిగింది...ఊరు అవీ కొన్న తర్వాత ఆరుగంటలవుతూండగా యిద్దరూ ఒక రెస్టారెంటులో ప్రవేశించారు. ఐస్‌క్రీం తింటూ కృష్ణ, "భవానీ, సినిమాకు వెళ్దామా? ప్రక్కనున్న థియేటర్లో క్రొత్తతెలుగు సినిమా వచ్చినట్లుందే!" అన్నాడు.

"భూకైలాస్., వెళ్దామా...సరే!" అన్నది భవాని.

అంత సులువుగా భవాని అంగీకరిస్తుందనుకోలేదు కృష్ణ. 'ఎలాగ? అమ్మతో చెప్పలేదే!' అని అంటుందేమో! లేకపోతే, 'ఏం సినిమా? తలనొప్పి, వద్దులే!' అని అభ్యంతరం చెబుతుందనీ, బలవంతపెట్టవలసి వస్తుందని ఊహించాడు. కాని భవానికి అలాంటి జంకుగొంకులు ఏమీ ఉన్నట్టులేవు! నిన్నరాత్రి వచ్చిన ఆ యువకుడితోనూ, స్నేహితుల్తోనూ యిలానే సినిమాకు తల్లితో చెప్పకుండా వెళ్ళటం బాగా అలవాటున్నట్టుంది భవానికి!......

థియేటర్లో చాలసార్లు భవాన్ని మాటల్లోకి దింపాలని ప్రయత్నం చేశాడు కృష్ణ. కాని భవాని 'సినిమా చూద్దాం!' అని వారించటంతో లాభంలేకపోయింది.

అసలు యీ మనస్తత్వపు స్త్రీలకు మాటల్తో ఏంపని? కౌగిలి సినవి అనుభవాలే! అనుకున్నాడు కృష్ణ. మెల్లగా తనచేయి భవాని చేతిని స్పృశించేలా చేశాడు; కాని భవానిలో ఏవిధమైన చలనమూ లేదు. తర్వాత నెమ్మదిగా తనభుజం ఆమెభుజాన్ని తాకేటంత మేర ఆమెవైపు ఒరిగాడు. భవాని క్షణం అలానేవుండి అటువైపుకు ఒరిగి తప్పుకుంది...మళ్ళీ ఆమె యిటువైపు కదుల్తుందేమోనని నిరీక్షించాడు కృష్ణ. కాని లాభంలేకపోయింది.

సినిమా వదలిపెట్టిన తర్వాత భవాని, "టాక్సీలోవెళ్ళిపోదాం, తొందరగా వెళ్ళొచ్చు" అన్నది...'దారికి వస్తోంది; నేను పట్టివెట్టి మొహాన్ని కాకపోతే ఏదో మాట్లాడాలి, ఒకళ్ళభావాలొకళ్ళతో చెప్పుకోవాలి అనుకున్నానుగాని, యిందులో మాటలు నిజంగా అనవసరమే! శరీరాలే మాట్లాడుకోవాలి!" అనుకొని ఒక నిశ్చయానికి వచ్చాడు కృష్ణ...టాక్సీలో భవాన్ని స్పృశిస్తూ ప్రక్కనకూర్చున్నాడు గాని ఏం చెయ్యటానికీ ధైర్యం చాల్లేదు; పదినిముషాల్లో టాక్సీ యిలు చేరుకోవటంతో టైమూ చాల్లేదు.

ఇద్దరూ భోజనానికి కూర్చున్నారు

"ఎలావుంది బావా సినిమా? కథ చాల బాగుంది!" అన్నది భవాని

"రావణుని అమాయకుణ్ణిచేసి మోసం చేశారు దేవతలు; పాపం రెండుసార్లూ దగాపడ్డాడు"

"అది అమాయకత్వమెలా అవుతుంది? రాక్షసత్వం. లేకపోతే శివుడు 'ఏం వరము కావాలి' అంటే 'నీ భార్యకావాలి' అంటాడూ! వాడిమనస్సుకు తగినట్టే పార్వతి కాళీమూర్తిగా కనిపించింది. భయపడి, అంతటితో వెళ్ళి మండోదరినే పార్వతి అనుకుని తృప్తిపడ్డాడు..."

"రెండోసారి అలాంటిదేమీ లేదుకదా, అప్పుడు జరిగింది మోసమేనా!"

"దానికీ రావణుని గుణమే కారణం ఆత్మలింగం, అదేదో వస్తువులాగా దాన్ని కనిపించిన పిల్లవాడి చేతి కివ్వటమేమిటి? అంటే వాడికి దాని విలువ తెలీదు! మనకొక రత్నం దొరుకుతుందనుకో, దాని విలువ తెలీకపోతే పోగొట్టుకుంటాము, అంతే! అందులో మోసమేం లేదు. ఒక గేమ్ వుంది, దాని రూల్సు ప్రకారం ఆడాలి...ఆత్మలింగం క్రింద పెట్టకూడదన్న నిబంధన వుంది, అజాగ్రత్తవల్ల దాన్ని పాటించలేక ఓడిపోయాడు.. విచారించి లాభమేమిటి?"

భవాన్ని మాటల్లో అంతరార్థంకోసం వెతుకుతున్నాడు కృష్ణ...విలువ తెలీక భవాన్ని తను అలా పోగొట్టుకున్నాడు అంటోందా?

"అయితే రూల్సు తెలిసినంతమాత్రాన జాగ్రత్తగా వుండి కూడా గెలవకపోవచ్చుగా! అదృష్టం కలిసిరావాలి!"

"నిజమే దానికి అదృష్టం కాదు, చొరవా సామర్థ్యమూ వుండాలి. రావణుడికి అవి వున్నాయి, రూల్సే తెలీవు. కాని చాలమందిలో చొరవా, సామర్థ్యమే వుండవు, రూల్సు బాగా తెల్సినా!"

"మంచి సిద్ధాంతమే తయారుచేశావ్!" అన్నాడు కృష్ణ నవ్వుతూ, తనకు విషయం పూర్తిగా అర్థమైందన్నట్లు.

రూల్సు తెలియటమే కాదు, చొరవవుండాలి ఆడదాన్ని అనుభవించటానికి! అనుకున్నాడు కృష్ణ.

భోజనం ముగించి ముందుగదిలోకి వచ్చారు.

"నేను రేపు ప్రొద్దున వెళ్ళిపోతాను; నీదగ్గరేవో నమూనాలు వున్నాయి తెమ్మని చెప్పిందే!" అన్నాడు కృష్ణ, భవాని అభిప్రాయం కనుక్కుందామని.

"ఆ నమూనాలు నా ఫ్రెండు ఒకావిడ దగ్గరున్నాయి. నిన్న, యివాళ, ఆవిడ యింటికి వెళ్ళలేకపోయాను. ప్రొద్దునే వెళ్తాను. రేపు ఎలాగూ ఆదివారం; వుండి, ఎల్లుండి వెళ్తావా?"

"అయితే వాటికోసం ఒక రోజంతా ఆగాల్సిందే!"

"ఏం? అర్జంటు పనులేమైనా వున్నాయా?"

"వుంటే ఏంలే! సర్దుకోవచ్చు...కాని ఏం తోచకుండా..."

"ఏంటుకు తోచదు? నేనింట్లోనే వుంటాను...మ్యూజియం చూట్టానికి వెళ్దామా?"

"నే నిదివరకే చూశాను."

"పోనీ మేటనీకి."

"సరే రేపు ఆలోచించుకోవచ్చు...అయితే వుండక తప్పదంటావ్!"

కృష్ణ పడుకున్నతర్వాత చాలసేపు నిద్రపోలేదు...ఏదైనా అలికిడైతే భవాని ఏదో నెపంతో తనగదివైపు వస్తోందేమో అనుకుంటూ చాలసేపు నిరీక్షించి, తను రేపు వుంటానని చెప్పటం పొరపాటనీ, అలా చెప్పకుండా వుంటే ఫలితం వెంటనే దక్కేదనీ ఆలోచించుకుని, చివరకు నిద్రపోయాడు.

* * *

ఆదివారం ప్రొద్దున భవాని స్నేహితురాలి యింటికి వెళ్ళి పదకొండు గంటలకు నమూనాలతో తిరిగివచ్చింది.

మధ్యాహ్నం చదరంగం ఆడుతూ కూర్చున్నారు భవానీ, కృష్ణ. మొదటి రెండు ఆటలూ భవానీయే గెల్చింది. కృష్ణదృష్టి ఆమె వ్రేళ్ళ మీద, చేతులమీద, కంఠంమీద, నొసటిమీద పరిభ్రమిస్తూ ఆవేశకారణ మౌతోంది. ఆటమీద ధ్యాస తక్కువై బాగా తప్పులు చేస్తున్నాడు.

మూడో ఆటలో భవాని, "ఈ గుఱ్ఱం దెబ్బతో ఆట కట్టింది." అంటూ కృష్ణ గుఱ్ఱాన్ని తొలగించబోయింది. కృష్ణ ఆమె వ్రేళ్ళని అరచేతిలో యిముడ్చుకుంటూ "ఓహో...పొరపాటు" అన్నాడు. భవాని నవ్వుతూ "ఎప్పుడూ పొరపాటు అంటే ఎట్లా? నడులు కావా, గుఱ్ఱం దక్కింది." అంటోంది. తాంబూలంతో కెంపుల్లా వున్న పెదవులు, నవ్వుతూ కవ్విస్తున్న భవానిని వదలిపెట్టలేక, ఆమె చేయి తనకు దగ్గరగా లాక్కుంటూ కృష్ణ, "గుఱ్ఱం కాదు, నేను చిక్కుపడ్డాను నీ వలలో." అన్నాడు.

భవాని ఒక్క విదిలింపుతో చెయ్యి వదిలించుకొని, మెల్లిగా చదరంగం అటమీది సైన్యాన్ని పెట్టెలోవేసి అట్టను మడిచి పెట్టింది.

"భవానీ, విధి ఎలా మోసంచేసినా మనం దంపతులమే..."

"ఇక చాల్లే! నువ్వెంతో మంచివాడి వనుకున్నాను!...... పెళ్ళాం, పిల్లలున్నారు, ఏమి టీబుద్ధి?... ఏమి నీకు విధిచేసిన మోసం? నీ క్కావలసిన అమ్మాయిని కోరి చేసుకున్నావు. నా తరువాతేమిటి?... ఎప్పుడో పెళ్ళిమాటలు జరిగాయనే వంకతో యిప్పుడు నన్ను నాశనం చేయాలనా నీ ఉద్దేశం?...నీ పెళ్ళికీ మన బంధుత్వానికీ సంబంధం లేదని నాకు తెలిసికూడా నీ సద్భావంతో నీ యింటికి, అమ్మను నచ్చచెప్పి తీసుకొచ్చాను ... నేను దగ్గరవుంటానంటే నీకు భయం వేసి నన్ను చేసుకోనన్నావు! అందుకు నేనేం పడి ఏడవలేదే! ఇప్పుడు నీబుద్ధి చూపిస్తున్నావా!... నాకు పెళ్ళి కళ్ళముందుంది; నన్ను తాకటానికి నీకేమిటి హక్కు?"

భవాని చదరంగం వస్తువులు తీసుకుని అక్కడినుంచి వెళ్ళిపోయింది...

ఎంత ఆలోచించినా కృష్ణకు భవాని ప్రవర్తనలోనే లోపం కనిపిస్తోంది. ఎటువంటి వ్యక్తిత్వం భవానికి! ఆమె తనని కవ్వించి అలా ప్రవర్తించకపోతే తను యీ పొరపాటులో పడివుండేవాడు కాదు! అవమానం చెయ్యాలని, ప్రతీకారదృష్టితోనే యిలా చనువుగా ఆకర్షించి నాటకం ఆడింది భవాని! లేకపోతే ఆడదానికి, పెళ్ళైనవాడితో తనతో యీ చనువేమిటి?

భవాని చనువును చూచి భయంవేసి తను చేసుకోనన్నాడట! ఎంత చమత్కారం! నిజమే, యిలాంటి చాతుర్యంవున్న ఆడదాన్ని చూచి భయపడటమే మంచిదయింది. తను చేసిందంతా 'సద్భావం, బంధుత్వం' క్రింద లెక్క తేల్చుకుంది! ఇలాంటివాళ్లు కొంపలు తీసే కొయ్యలు!

వెళ్ళి గదిలో పక్కమీద పడుకున్నాడు కృష్ణ...

ఈ ప్రయాణం తను ఎందుకు చేసినట్లు? భవాని అంటే తనకున్న భావం ఏమిటి? తను చేసిన పొరపాటేమిటి? భవాని ఎందుకిలా అవమానించింది? అన్న ప్రశ్నలకు మళ్లీ సమాధానాలు వెదుక్కున్నాడు...

భవాని అంటే తనకున్న భావం తనలో పాతుకుపోయింది; అందుకే వచ్చాడు.. కాని ఆమె అన్నట్లు ఆమె నేదో నాశనం చేయాలని తను రాలేదు! అసలు నిర్దిష్టంగా ఏమీ చెయ్యకూడదనే వచ్చాడు...కాని తను ఊహించిన ఉదాత్తత ఆమెలో లేదని తెలిసేటప్పటికి తనదృష్టి మారింది; తనలా చెయ్యి పట్టుకోవటం తప్పే!...భవాన్ని ఒకప్పుడు తనెంత ఉదాత్తంగా ప్రేమించాడో ఆమె కెప్పుడైనా అర్థమౌతుందా? అసంభవం! భవానిలో యిప్పుడు గర్వం, అహంకారం తప్ప మరేమీ మిగల్లేదు...ఆ అహంకారంతో తనమీద దెబ్బతీసింది!

ఆ పెళ్ళి చేసుకునే అమాయకుడు నిన్న కొనుక్కొని వచ్చిన వాడేనా? వాడికి యీవిడ చనువతో సినిమాకు వెళ్ళటం, చదరంగం ఆడటం, చమత్కరించటం, తెలిస్తే వాడు చేసుకుంటాడా?... తప్పైతే చేసుకోలేదు!

అసలు జీవితం యింతే! దూరపుకొండలు నునుపు...అన్నీ ఎండమావుల్ని అందుకోవాలని చేసే విఫల ప్రయత్నాలు... ఇదంతా ఒక చిత్రభ్రమ! భవానిలాంటి వాళ్ళకు ఊహల్లో స్థానం కల్పించటమే ఒక పెద్ద పొరపాటు!...

* * * * *

రైలు దిగి యిల్లు చేరుకుని మధ్యాహ్నభోజనం తర్వాత విశ్రమిస్తూ అనసూయను కేక వేశాడు కృష్ణ.

"ఏమిటండీ యింకా మీరు లేచున్నారని పిలుస్తున్నారు!"

"ఏం చేస్తున్నావ్? బాబు నిద్రపోయాడుగా."

"ఏంలేదు, ఆ స్వెట్టర్ యిప్పుడే ప్రారంభిద్దామని."

"గోల! యిలా కూచోరాదూ. కబుర్లు చెబుతా!"

"ఒక్క నిమిషం." అంటూ అనసూయ వెళ్ళి పాలు అవీ తెచ్చుకొని "చెప్పండి!" అంది.

"అబ్బ! అవి అక్కడపెట్టి యిలా రమ్మంటే!"

అనసూయ వచ్చింది. కృష్ణ ఆమెను కౌగిట్లోకి లాక్కున్నాడు..."ఊఁ...ఊరుకోండి!"..."అయితే భవానీ వాళ్ళ యింటికి వెళ్ళారన్నమాట."

"ఓఁ ఎందుకా గొడవ! ఏదో వెళ్ళాను, వచ్చాను!"

"మీరు భలేవారండీ! మీ రెలా వాదించినా ఎన్ని మాట్లాడినా చివరకు నెగ్గేది ఒక జీవని మాకు తెలుసుగా!...నిరుపల్ల మెరుగు...!"

నిజమే, తను ధర్మచ్యుతుడు కాలేదు అనుకున్నాడు కృష్ణ!